# చైతన్య ప్రవంతి

"అమరశ్రీ"

[పండు వెన్నెల. చుట్టూరా వెండి కొండలు. చంద్రుడి చుట్టూ నక్షత్రాలు. గొప్పతనం చుట్టూ చిన్నతనం. తక్కువ తనం మధ్య ఎక్కువతనం. అంతా నిశ్శబ్దం. ప్రపంచం గుండె ఆగిపోయి ఉంటుంది. అంతే జరిగి ఉండాలి. ఒక్క ప్రాణం మాత్రం పోలేదు. డాబా మీద పిట్టగోడ కీనీడలో, బ్రతికున్న సిగరెట్ చలనం.]

* * *

డాబామీద పడుకున్న ముకుందరావు అకస్మాత్తుగా లేచాడు. తను అకస్మాత్తుగా లేచినట్లు అతనికి తెలియదు. తనకు తెలియకుండానే తను చాల పనులు చేస్తుంటాడు. తనకు తెలియకుండానే తను చాలపనులు చేస్తుంటానని అతనికి తెలియదు. చాల శోచనీయం కావచ్చు. దానిని నిర్ణయించటాని కెవడికి హక్కు అర్హతలున్నయ్, ఒక్క ముకుందరావుకు తప్ప.

ఇప్పుడు తనేం చేస్తున్నదీ తనకి తెలుసు. కళ్ళు తెరిచాడు. ఇప్పుడు ప్రతి పనీ తెలిసే చేస్తున్నాడు, ఎందుకు చేస్తున్నాడో తెలియక పోయినా. కళ్ళు చూడగలిగినంత కళ్ళ ముందర కనుపిస్తున్నదంతా కనుపించింది.

ఎడంచేయి పైకి వచ్చింది. తల ఆవైపు తిరిగింది. రేడియమ్ డయల్ మెరుస్తోంది వెన్నెలలో కూడ. కంపెనీ వాళ్ళిచ్చిన గ్యారంటీ చాల గ్యారంటీయేనన్నమాట. రెండు గంటల అయిదు నిముషాలయింది.

ఇంత అర్ధరాత్రి వేళ తనెందుకు లేచాడు? మనకు తెలియకుండానే మనం చాలాపనులు చేస్తుంటామన్న విషయం అకస్మాత్తుగా గుర్తుకు వచ్చింది. ఇన్నాళ్ళనుంచి గుర్తుకు రాని విషయం ఈ నిమిషంలో ఎందుకు గుర్తుకువచ్చింది? తనకు గుర్తుతెచ్చుకోకుండానే గుర్తుకు వచ్చింది మనకు తెలియకుండా మనం చాల పనులు చేస్తుంటాం గాబట్టి.

నిజం. నిజమేనా? అబద్ధం ఎందుకు కాకూడదు? మచ్చుకి ఒక్క తునక. పూడ్చివేసిన గుంటను త్రవ్వటం ప్రారంభించాడు. ఇంతకూ తను చేసిన పనేమిటి? తనకు తెలియకుండానే తను గడియారం వంక చూశాడు. టైము తెలుసుకోవటం మాత్రమే తనకు తెలిసింది. గడియారం వంక చూడటం మాత్రం, ముందర అనుకొని చేసిన పని కాదు. అది అలవాటు. కాబట్టి తనకు తెలియకుండానే చేశాడు ఆ పని. కాదు, అలవాటు. దాని వెనుక ఇంకేదో ఉన్నది. కొన్ని పనులు అలాగే చేస్తుంటాం మనం. చీమ కుట్టినపుడు గోక్కుంటాము. దోమ కుట్టినపుడు రెండు చేతులతోను దానిని చంపేస్తాము. ఆ చంపేయటం అనేది, ఆ సమయంలో మనం చేస్తున్న పనికి అంతరాయం కలిగించదు. అటువంటివన్నీ మనకు తెలియకుండానే జరిగిపోతుంటయ్. చిన్నప్పటి సైన్సు కొద్దిగా జ్ఞాపకం ఉన్నట్లున్నది. అటువంటి పనులకి కారణం మనలో ఉన్న ఏవో కొన్ని నరాలు. వాటిని గురించి ఆలోచించటం... అవసరమా? అనవసరమా?

అవసరమో అనవసరమో మనమెవరం నిర్ణయించటానికి? ఒక్కటి మాత్రం నిజం, మనకు తెలియకుండానే మనం చాలా పనులు చేస్తుంటాము. నిజం. అబద్ధం కాదు. అబద్ధం ఆడటాన్నే నిజమనీ, నిజం చెప్పటాన్నే అబద్ధమనీ ఎందుకనకూడదు? దాని నంతా సంస్కరణ అంటారు కాబోలు. ఇది చాలా బాగున్నది. దానిని అందరికీ చెప్పి, పేపరులో వేయించి ప్రచారంచేస్తే ఏమవుతుంది?

తలవైపు దిండు దగ్గరకు చేయి పోనిచ్చాడు ముకుందరావు. తానిప్పుడు చేస్తున్న ప్రతిపనీ తనకు తెలుసు. సిగరెట్ తీశాడు. వెలిగించాడు. ఒక్క పది సెకండ్లు మండి అగ్గిపుల్ల ఆరిపోయింది. పొగ బాగా లోపలకు పీల్చాడు.

ఆలోచన బాగా ముందుకు సాగగల అవకాశాలున్నాయ్. దూరాన పాట వినిపించినట్లయింది.

"ఏది సత్యం?
ఏ దసత్యం?"

తరువాత పాట వినిపించలేదు. విసుగుపుట్టి రికార్డు తీసిపారేశారు కాబోలు. అన్నం తినటం మానరు. గుడ్డ కట్టుకోవటం మానరు. విసుగు పుట్టిన ప్రతివస్తువుకీ మనందూరంగా ఉంటామా? ప్రతిరోజూ మనం బ్రతికున్నంత కాలం నిద్ర పోతూనే ఉంటాము. నిద్రలేస్తూనే ఉంటాము. ప్రొద్దున్నే ప్రతి రోజూ ముఖం శుభ్రంగా కడుక్కుంటాము. పాచిలేకుండా పళ్లు తోముకుంటాము. పళ్లు కట్టించుకున్నవాళ్ళ శ్రద్ధ వాళ్ళకే తెలుసు. రోజుకు నాలుగుసార్లకు తక్కువలేకుండా శుభ్రంచేస్తారు వాటిని. ఆ పనులు చేయటానికి విసుగుపుట్టదు. యెందుకని? పైగా మరొకటి. పళ్లు తోముకోని వాడిని చూస్తే వీళ్ళకు అసహ్యం.

సిగరెట్ పీల్చటం మర్చిపోయాడు ఆలోచించటంలో మునిగిపోయి. వెంటనే జ్ఞాపకం తెచ్చుకొని ఒక్కదమ్ము లాగి మళ్ళా ఆలోచించ ప్రారంభించాడు.

ముకుందరావుకి చాల ఆశ్చర్యం వేసింది. పళ్ళు తోముకోని వాడిని చూసి వాడికి విసుగు పుట్టిందని ఎందుకు కనుక్కోరు వీళ్ళందరూ? కొన్ని విషయాలలో విసుగు పుట్టినప్పుడు, మరి కొన్ని విషయాలలో విసుగు ఎందుకు పుట్టదు? ఎక్కువగా చేసే ఏ పనన్నా ఎవరికైనా విసుగు పుడుతుందని అందరికీ తెలుసు. కాని వాడిని చూస్తే అసహ్యం. వాడు విసుగుపుట్టే ఆ పని చేయకపోయినా, వాడిలో మరేదో లోపించిందనుకోవటం, అసహ్యపడటమూనూ.

మరోసారి సిగరెట్ పొగ పీల్చటంతో అసలు విషయం బోధపడింది ముకుందరావుకి. అలా పళ్ళు తోముకోకుండా తాము ఉండలేరు ఏ కారణంవల్లనైనా గానీయండి. అలా ఉండగలిగిన వాడంటే వాళ్ళకు లోపల సదభిప్రాయం కూడ. కాని వాళ్లు చేయలేని పని ఎదుటివాడు చేస్తున్నాడు. అందులో ఇదొకటి. ఇద్దరి పరిస్థితులూ, అవకాశాలూ అన్నీ సమానం. ఎవరైనా చేయవచ్చు ఆ పని. చేయటానికి ధైర్యంలేక చెయ్యలేరు కొందరు. కొందరికి విసుగుపుట్టదసలు. ఇరవైనాలుగు గంటలూ వాళ్ళ జీవితమంతా ఒకే పని చేయమన్నా చేసేవాళ్ళున్నారు కొందరు. వాళ్ళందరకూ సుఖంగా, అవలీలగా, తేలికగా బ్రతికే వాడంటే తేలిక. వాళ్ళకు తేలికగా బ్రతకటం చాల కష్టం. అదీ అసలు కారణం.

మనం బ్రతికేది వంద సంవత్సరాలు. అసలు ప్రపంచం వయస్సెంత? కొన్ని వేల, లక్షల, కోట్ల సంవత్సరాలు. అందులో మన జీవితం యెన్నో వంతు. లెక్కల్లో చాల "పూర్" ముకుందరావు. కాని సుమారుగా అంచనాలు వేయటంలో అందెవేసిన చేయి. అటువంటి ఈ వంద సంవత్సరాలు ఎలా అనుభవించటం? ఈ పుట్టి జీవిస్తున్న వాళ్ళలో ఎంతమందికి తెలుసు ఎలా జీవించాలో? ఎలా జీవించాలో తెలియనివాళ్ళకు కూడ ఒక జీవితం. జీవితాలను పంచిపెట్టేవాడు (ఒకవేళ అలాటివాడు యెవడన్నా ఉంటే) ఒక విషయం గుర్తుంచుకోవాలి. జీవించటం ఎంతమందికి తెలుసు? అని విచారించి వాళ్ళకు మాత్రమే పంచిపెట్టాలి జీవితాలను. బాగా వంద సంవత్సరాలు జీవించగలిగిన వాళ్ళకు, మరో వందగాని వేయిగాని సంవత్సరాలు జీవితకాలంక్రింద యిచ్చివేసినా ఇబ్బందిలేదు. అసలు జీవించటం అనేదే తెలియనివాళ్ళకు వంద సంవత్సరాల జీవితంకూడ ఇవ్వకూడదు. అంతగా జీవితాలు మిగిలిపోతే బాగా జీవించేవాడికే రెండు, మూడుకూడ ఇవ్వవచ్చు. సద్వినియోగం చేసుకొనేవాడికి ఇచ్చినా ఫలమూ, పాటూను.

ఈ జీవించేవాళ్ళందరూ అంతే. ఎలా జీవించాలో తెలియనివాళ్ళే. బాగా జీవించటం తెలిసినవాళ్లు చాల త్వరగా చనిపోతుంటారు. నూరు సంవత్సరాలకంటె తక్కువ వాళ్ళ భాగం. కారణం? జీవించటం బాగా తెలిసినవాళ్లు త్వరగా చనిపోతుంటారు. కారణం? సిగరెట్ పొగ బాగా లోపలకు పీల్చాడు.

* * *

[పిట్టగోడ కీనీడలో సిగరెట్ వెలుగు. ఆ వెలుగుచుట్టూ ఒక మెరుపు, పిట్టగోడ

కే నీడలో చంద్రుడికంటె ఎక్కువగా ఉన్నది దాని కాంతి. ఆ నీడలో అది చంద్రుడికంటె ఎక్కువే. నిష్పత్తి ప్రకారం ఆ పరిస్థితులలో సిగరెట్ కొన్ని రెట్లు ప్రకాశవంతం చంద్రుడికంటె. చంద్రుడి పరిస్థితులూ, చంద్రుడిశక్తీ కొలిస్తే తప్పకుండా ఇదే అనుభవం కలుగుతుంది. సిగరెట్ ఎప్పటికంటె ఎక్కువగా వెలుగుతోంది]

* * *

ముకుందరావు ఆలోచన బాగా సాగింది, సిగరెట్ పొగ బాగా లోపలకు పీల్చటంతో. జీవించటం చేతకావటం యెంత అదృష్టం. ఈ నిమిషంలో ప్రపంచంలో జీవించేవాళ్ళలో యెంతమందికి తెలుసు జీవించే విధానం? చాల కొద్దిమందికి. అది తెలిసినవాళ్లు అతి త్వరగా చనిపోతారు.

ఆకాశంవంక చూశాడు. తన చుట్టూ తను చూసుకున్నాడు. ఆర్. యల్. స్టీవెన్‌సన్ ఒకడు, జీవితాన్ని యెలా అనుభవించాలో తెలిసినవాళ్ళలో. ఇంగ్లీషు రచయితల జీవితాలలో ఎవడి జీవితంలోనూ అటువంటి అనుభవాలు కనుపించవు. ప్రత్యేకంగా అతని జీవితంలో ఒక సంఘటన జ్ఞాపకం వస్తోంది ముకుందరావుకి, తన చుట్టూ తాను చూసుకుంటుంటే.

స్టీవెన్‌సన్ దేశం అంతా తిరిగేవాడు ఒక గాడిదమీద. ఒకనాడు ఒక అరణ్యం మధ్యకొచ్చేసరికి ప్రొద్దుకూకింది. అక్కడే చెట్లమధ్య ఖాళీ ఉన్నచోట ఆగిపోయాడు ఆ రోజుకి. భోజనంచేసి పడుకున్నాడు. రాత్రి సరిగా రెండు గంటలకు మెలుకువ వచ్చింది. కళ్లు తెరచి చూశాడు. అంతా వెన్నెల. చుట్టూరా చెట్లు. సిగరెట్ వెలిగించాడు. అన్నీ ఉన్నయ్ ఒకటి తప్ప అని విచారించాడు. కాని ఉన్నదానితోనే తృప్తిపడ్డాడు. ఆ విషయం చెపుతూ అంటాడు స్టీవెన్‌సన్. ప్రతి మనిషికి రాత్రి రెండుగంటలవేళ తప్పకుండా మెళుకువ వస్తుందని. చాలమందికి తాము మేలుకున్న విషయం తమకే తెలియదు. చాల కొద్దిమందికి మాత్రమే తెలుస్తుందని అంటాడు.

ముకుందరావుకు వెంటనే ఒక విషయం జ్ఞాపకం వచ్చింది. తనుకూడ సరిగా రెండు గంటల అయిదు నిముషాలకు తెలుసుకున్నాడు తను లేచానని. బహుశా తనకుకూడా సరిగా రెండుగంటలకే మెలకువ వచ్చివుండాలి.

ఆ టైముకి మెళుకువ వస్తే తెలుసుకోగలిగిన కొద్దిమందిలో తనుకూడ ఒకడు. అంటే తను వాళ్ళతో సమానమన్న మాట. అంటే తను స్టీవెన్‌సన్ అంతటి వాడన్నమాట. ఆ సమయానికి నిద్ర లేవటంలో మాత్రమే.

వెంటనే గుర్తుకువచ్చింది ఆ విషయం. లేకపోతే చాలా ప్రమాదాలు జరగగల అవకాశాలున్నయ్. అతనితో సమానమనుకొని తను ఏపనైనా చేయవచ్చు. చేసి ఫలితం అనుభవించనూ వచ్చు. ప్రతి మనిషి ప్రతి మనిషికీ ఏదో ఒకవిషయంలో సమానం కాకమానడు. ఉదాహరణకు తిండి తినటంలో ప్రతివాడు స్టాలిన్‌తో సమానమే. అంతమాత్రానికే స్టాలిన్‌తోనేను సమానమని అనుకోవటం బుద్ధి తక్కువనుకున్నాడు ముకుందరావు. స్టాలిన్ చేయగలిగిన పనులను మనం చాలావరకు చేయలేమని గుర్తుంచుకోవాలి.

తను స్టీవెన్‌సన్‌లా కథలు రాయలేకపోవచ్చు. కాని స్టీవెన్‌సన్ లానే రాత్రి రెండింటింకి మెలుకువ వచ్చినప్పుడు తెలుసుకోవచ్చు. ఈ విషయంలో మాత్రం తను అతనితో సమానం. చాలు. తను చాలా అల్పసంతోషిననుకొని మరోసారి పీల్చాడు సిగరెట్ పొగ.

స్టీవెన్‌సన్ రాసిన విషయం ఈనాటికీ బాగ జ్ఞాపకం. ఎంతబాగా వ్రాస్తాడు! కళ్ళకు కట్టినట్లు కనుపిస్తుంది అతనేదైన చెప్పాలో ఉంటే. అదీ అతనిలో ఉన్న గొప్పదనం. అందరిలో లేనిది ఒకడిలో ఉంటేనే అది గొప్పతనమవుతుంది. అది అతనిగొప్పతనం అంటున్నామంటే, అది అతనికే చేతనవును. మరెవరకూ చేతకాదు అని దాని అర్థం. అవును. అది నిజంగా అతని గొప్పతనం. అతను ఒక కథ చెపుతుంటే సినిమాలా ఆ కాస్తా మన కళ్ళముందు కనుపించేది.

* * *

[సిగరెట్ మరింత దేదీప్యమానంగా వెలుగు

తోంది. పట్టుకున్న చేతికి కూడ తగులుతోంది వేడి. నుసి రాలింది కొబోలు, ఆ క్షణంలో ఆ డాబా కీనీడలో ఎప్పటికంటె స్పష్టంగా కనిపిస్తోంది సిగరెట్ వ్యక్తిత్వం.]

* * *

సినిమాలా కనుపించటం కావలసింది. అలా కనుపించేలా చేసేదానినే మంచి రచన అంటాం. ముకుందరావుకి కొంచెం చికాకయినా ఈ విషయాన్ని గురించే ఆలోచించాలన్న బుద్ధి పుట్టింది. ఏదైనా అంతే. సినిమా కొలత బద్ద ఏదైనా ఏమిటి? మన జీవితానికే ఒక కొలతబద్దయి కూర్చుంది సినిమా.

సినిమాలో కనిపించిన చీర కట్టటం గొప్పతనం. సినిమాలలో ఫాషన్ అన్ని ఫాషనులనూ మించిపోయింది. సినిమాలో నటించటం అనేది ఎవడైనా జీవితంలో చేయగలిగిన గొప్పపని! అదీ అసలు విషయం, సినిమా అంతస్తు ఆదీ మన సాంఘిక /వ్యవస్థలో.

స్వతహాగా ముకుందరావుకి సినిమాలన్నా సినిమావాళ్ళన్నా కొంచెం గౌరవం విలువా తక్కువ. అయినా, ఈ కాలంలో ఉంటున్నాడు గాబట్టి ఎదురీత ఈదలేదు. అదీ తన పరిస్థితి, అనుకున్నాడు ముకుందరావు.

ఇంతలో ఏవో కిచకిచలు,'నవ్వులు. ఎవరో కోకిల. అర్థరాత్రిపూట ఏం నవ్వులు? పక్కవాళ్ళని ఏంచేస్తాయో ఆ నవ్వులు, నవ్వేవాళ్ళకేం తెలుస్తుంది. సినిమా ...నవ్వులు. నవ్వులు ... సినిమా ...కిచకిచలు ... కేరింతలు....సినిమా ... నవ్వులు.

అమ్మయ్య! ఇప్పటికి గుర్తొచ్చింది. నిన్న సాయంకాలం జరిగిన సంఘటన. టూత్ బ్రష్ కొనుక్కుందామని బజారు కెళ్లాడు. వెళ్ళినవాడు కర్మంచాలక ఒక షాపులో కెళ్లాడు. ఆ షాపులో ఒకమ్మాయిని చూశాడు. తను షాపులో అడుగుపెట్టే సమయానికి అమ్మాయి యెవరితోనో పరాచికాలాడుతోంది. తనను చూసి ఆగిపోయి "ఏం కావాలండీ?" అని అడిగింది. తను ఏం కావాలో చెప్పాడు. తీసుకున్నాడు. అన్నీ మామూలుగానే జరిగినయ్.

తను టూత్ బ్రష్ కొన్నంతసేపూ ఆమెను అభినందిస్తూనే ఉన్నాడు. కారణం? ఆమె "లానా టర్నర్"లా ఉన్నది. అదీ అసలు కారణం. ఆమె ఆ సినిమాతారలా లేకుండా, మరెంత అందంగా ఉన్నా తనామెను అభినందించి ఉండేవాడు కాదు

జీవితంమీద సినిమా బలప్రయోగం, జీవితం సితి, అంతా కనుపిస్తున్నయ్ తనకు. అంతవరకు వచ్చినయ్ మన పరిస్థితులు. సినిమాలో జీవితం ఎంత? జీవితంలో సినిమా ఎంత? సిగరెట్ పొగ పీల్చబోయాడు. నోరు చేయి కాలినయ్.

* * *

[కీనీడలో దూరంగా పోయి పడింది సిగరెట్. ఆ వెలుగంతా ఛిన్నాభిన్నమయి సహస్ర భాగాలైంది. ఒక్కసారి అన్నీ మాయమయి పోయినయ్. చంద్రుడు మాత్రం మామూలే. అంతా పండువెన్నెల. చుట్టూరా వెండికొండలు. మెల్లగా చల్లటి గాలి.]

* * *

ముకుందరావు ప్రక్కకు తిరిగాడు. నిద్ర పట్టింది. తనకు నిద్ర పట్టిందన్న విషయం కూడా తెలియదు ముకుందరావుకి. తనకు తెలియకుండానే ముకుందరావు చేసే పనులలో ఇది కూడ ఒకటి.

ప్రజల మధ్యకు వెడుతున్న వారికీ, ప్రజాభిప్రాయానికి చెవ్వొగ్గుతున్న వారికీ రెండు, మూడు సంవత్సరాలుగా ఒకమాట వినబడుతున్నది. అది "యం.యల్.ఏ. బిజినెస్" అనేమాట. కొందరు శాసన సభ్యత్వాన్ని వ్యాపార సరళికి దించినారని ఈ యెగతాళి తాత్పర్యం. ఇందుకు కొంచెం భిన్నమైన మరొక విమర్శ కూడా ప్రజనోటినుంచి మా చెవిని పడింది. ఒక యం. యల్. ఏ. మద్రాసులో టాక్సీలను వినియోగించకుండా ట్రాములలో, బస్సులలో తిరగడం ప్రాసంగిక విషయం కాగా, దానిపై వ్యాఖ్య "ఆయనకు ఫైల్ తక్కువ. టాక్సీలకు డబ్బు ఎక్కడ తెస్తాడు!" అని.—'ఆంధ్ర ప్రభ' సంపాదకీయం నుండి.